ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
గురువారం 28 మార్చి 2024



** రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.35 | సహర్ : 4.51 (శుక్రవారం)

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.142 | 206 | 234 |
| సూర్యాపేట | రూ.130 | 200 | 230 |
| నల్లగొండ | రూ.136 | 200 | 230 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 , కనిష్ఠం 24.0

# జిల్లాలో.. కరువు ఛాయలు

- లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం
- కొన్నిచోట్ల సాగులో 50శాతం మేర
- ఎస్సారెస్పీ, సాగర్ ఎడమకాల్వ కింద రైతులకు అపారనష్టం

మూడు నదుల పరివాహకంతో ఒకప్పుడు జిల్లా పచ్చని పంటలతో అలరారుతుండేది. ఓ వైపు సాగర్, మరో వైపు ఎస్సారెస్పీతో పాటు మూసీ పరివాహకంతో ఎక్కడ చూసినా పంటలతో పల్లెలు కనిపించేవి. గత పదేళ్లలో ఏనాడూ సాగు నీటి కోసం రైతులు అర్రులు చాచింది లేదు. అందుకు భిన్నంగా ఒక్కసారి పిడుగుపడ్డట్లు వర్షాభావం, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటి జిల్లాలో కరువు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా సాగర్ ఆయకట్టుతో పాటు ఎస్సారెస్పీ రెండో దశ కింద లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగయ్యేవి. పంట కోతలతో పల్లెల్లో సందడి వాతావరణం కనిపించేది. కానీ ప్రస్తుతం పంటలు ఎండిపోయి బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. రైతులకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నాయి. చేసిన కొద్దిపాటి సాగుకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

(ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)



మోతె మండలం రాయికుంట తండాలో వరిపొలాల్లో మేకలను మేపుతున్న రైతులు

జిల్లాలో ఎక్కడ చూసినా పంటలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. నీరందక పొలాలు బీళ్లుగా మారి పంట రంగు మారుతుంటే రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. పంట చేతికందే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తే ఎకరం పొలం చేతికందం లేదు. దీంతో పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం లేదు. ఇటు కష్టం అటు ఆర్థికంగా నష్టం రైతు లు భరించాల్సి వస్తోంది. ఈ యాసంగి సీజన్ రైతులను తీరని వేదనకు గురిచేస్తోంది. నీటి విడుదల అవుతుందని భావించిన ఆయకట్టు రైతులకు తీరని నిరాశే ఎదురైంది. సాగర్ ప్రాజెక్టు పరిధిలో క్రాప్ హాలీడే ప్రకటించగా, ఎస్సారెస్పీ రెండో దశలో అంతంతమాత్రంగానే నీటి విడుదలతో చివరి ఆయకట్టు పరిస్థితి అదే తీరులో ఉంది. ఇక బోరుబావులను నమ్ముకుని సాగు చేసిన రైతుల్లో ఆందోళన మరింత గా ఉంది. మూడుగంటలు పోసే మోటార్లు అరగంట సేపు మాత్రమే బోర్లు పోస్తుండటంతో రైతులు కష్టాల్లో పడ్డారు.

**ఎస్సారెస్పీ పరిధిలో..**

ఎస్సారెస్పీ రెండో దశ కింద వారబందీ తరహాలో నీటిని విడుదల చేస్తున్నప్పటికీ తక్కువ సామర్థ్యంతో నీటిని విడుదల చేస్తున్నారు. చివరి ఆయకట్టుకు నీరందడంలేదు. దీంతో సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని ఆయకట్టు పరిధిలోని పంటపొలాలు ఎండిపోతున్నాయి. సూర్యాపేట మండలం ఏల్కారం, దుబ్బతండ, రేఖ్యానాయక్‌తండాలో పొలాలు ఎండిపోయాయి. ఆత్మకూర్(ఎస్) మండలం ముక్తాకొత్తగూడెం, శెట్టిగూడెం, కోటపహాడ్, ఏపూర్, ముక్కుడుదేవుడుపల్లి, పాతర్లపహాడ్ గ్రామాల్లో 40శాతం పొలాలు ఎండిపోయాయి. మోతె మండలం రాంపురంతండా, విభలాపురం, తుమ్మలపల్లి, బీక్యాతండా, మోతె, రాఘవాపురం గ్రామాల్లో పెద్దఎత్తున పంట ఎండిపోయి రైతులు నష్టపోయారు. కొన్ని గ్రామాల్లో ఎండిపోయిన పొలాలను జీవాలు మేపడానికి వదిలిపెట్టారు. సిరికొండ గ్రామంలో ఎండిపోతున్న మిరపచేనుకు ఒక రైతు ట్యాంకర్ ద్వారా నీటిని పోస్తూ కాపాడుకుంటున్నాడు. చివ్వెంల మండలంలోని అన్ని గ్రామాల్లో బోర్లు, బావులు కింద సేద్యం చేసిన రైతులు 25శాతం నష్టపోయారు.

**అర్వపల్లికి చేరుకున్న గోదావరి జలాలు**

**అర్వపల్లి :** రైతులు ఎదురుచూస్తున్న గోదావరి జలాలను శ్రీరాంసాగర్ రెండోదశ ఆయకట్టు కింద ఉన్న 69, 70, 71డీబీఎం మెయిన్ కాల్వలకు ఎస్సారెస్పీ అధికారులు బుధవారం విడుదల చేశారు. అర్వపల్లి నుంచి సూర్యాపేట నియోజకవర్గానికి చేరాయి. 71 డీబీఎంకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



**సాగర్ ఎడమకాల్వ పరిధిలోనూ**

సాగర్ ఎడమకాల్వ కింద కనీసం రెండు పర్యాయాలు నీటిని విడుద ల చేస్తారని రైతులు ఆశించి, సాగుచేశారు. ఎత్తిపోతల పథకాలు కూడా రైతులకు అందుబాటులో కి వస్తాయని భావించారు. తీరా చూస్తే కాల్వకింద నీటిని విడుదల చేయకపోగా క్రాప్ హాలిడే ప్రకటించారు. బోర్లు, బావుల కింద వ్యవసాయం చేసిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పంట సాగుకు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు ఆం దోళన చెందుతున్నారు. పంటలు ఎండిపోయి కోదాడ మం డలం దోరకుంట, నల్లబండగూడెం, కాపుగల్లు, రెడ్లకుంట గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి రూ.10 నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి అవుతుండగా పంట ఎండిపోయి దిగుబడి పూర్తిగా తగ్గే ప్రమాదం నెలకొంది.

**వేగంగా పడిపోతున్న భూగర్భజలాలు**

జిల్లాలో భూగర్భజలాలు మరింత లోతుకు పడిపోతున్నాయి. గతేడాదితో పోలీస్తే సుమారు 5.5 మీటర్లకు కిందకు వేగంగా దిగిపోయాయి. దీంతో పలుచోట్ల బోర్లు, బావుల్లో నీరు ఉండటం లేదు. గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో నీటిఎద్దడి ఉండేది. ఈ సారి ఈ నెలలోనే తాగునీటి కోసం జనం అల్లాడిపోయే పరిస్థితి ఉంది. ఇక మే నెలలో పరిస్థితి ప్రమాదకరంగా ఉండేలా ఉంది. జిల్లాలో గత ఏడాది 7.23 మీటర్లలో భూగర్భజలాలు లభ్యం కాగా ప్రస్తుతం 12.38 మీటర్లకు పడిపోయాయి. అదేవిధంగా గత ఏడాదితో పోలిస్తే సాధారణ వర్షపాతం కంటే 36శాతం తక్కువగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న కాలంలో జల సంక్షోభం తప్పదని అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

**1.70 లక్షల ఎకరాల్లో ఎండిన వరి**

జిల్లాలో వరి ప్రధాన సాగు. ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 3,83,136 ఎకరాల్లో సాగు చేశారు. దీనిలో 40శాతం నుంచి 50శాతం వరకు 1.70లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయింది. సాగర్ ఆయకట్టు పరిధిలో వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. నీటి విడుదల లేక పంటలు చేతికొచ్చే పరిస్థితి కనిపించ డం లేదు. జిల్లా మొత్తంలో అన్ని పంటలు కలుపుకొని 3,85,894 ఎకరాల్లో సాగుచేయగా కేవలం వరి పంట 95శాతానికి పైగా సాగుచేశారు.

**పంటలపై నష్టంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు**

నష్టపోయిన పంటలను సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటిఆదేశాలు రాలేదు.అయినప్పటికీ మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. కొన్నిచోట్లు నాలుగు ఎకరాల్లో వరి వేస్తే అర ఎకరం ఎండిపోయిన సంఘటనలు ఉన్నాయి.మరికొన్ని చోట్ల ఎకరం కూడా నష్టపోయారు.

- శ్రీధర్‌రెడ్డిచ, జిల్లా వ్యవసాయ అధికారి

**ఆరు ఎకరాలు వేసి నష్టపోయా**



అరు ఏకరాలు వరిపంట వేశాను.సాగునీరు లేక లేక ఏకరంనర పూర్తిగా ఏండిపోయింది. మిగిలిన నాలుగున్నర ఏకరాల్లో కూడా దిగుబడి పెద్దగా లేదు. కనీసం ఏకరానికి 30 బస్తాల దిగుబడి కూడా లేదు.

- నెమ్మాది లక్ష్మయ్య, ధర్మాపురం, పెన్‌పహడ్ మండలం

**మేళ్లచెర్వులో...**

**మేళ్లచెర్వు :** నాగార్జునసాగర్ నీరు రాదని తెలిసినా ఉన్న కొద్దిపాటి నీటి వనరులైన బోర్లు, బావులు, చెరువుల కింద సాగు చేసిన వరి పంట తీవ్ర నీటి ఎద్దడితో చేతికొచ్చే సమయంలో ఎండిపోతోంది. ఉమ్మడి మండలంలోని వేసవిలో బావులు, బోర్ల కింద ఉమ్మడి మండల వ్యాప్తంగా 3,300 ఎకరాలు వరి పంట సాగు చేశారు. ఇంతకాలం నీరు అందినా ఫిబ్రవరి చివరి వారం నుంచి భూగర్భజలాలు అడుగంటడంతో చాలావరకు బావు లు, బోర్లు, చెరువులు ఎండిపోతున్నాయి. కొత్తగా 400 అడుగుల లోతుగా బోర్లు తవ్వినా నీరు పడని పరిస్థితి ఏర్పడింది. మరో 15 రోజుల్లో చేతికొచ్చే పంట కళ్ల ముందే ఎండిపోవటంతో సాగర్ వైపు, ఎత్తిపోతల వైపు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా మహాశివరాత్రి జాతర సందర్భంగా ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించినప్పటికీ ఎత్తిపోతల పథకాలతో మొక్కుబడిగా ఒక్కరోజే నీరు రావటంతో రైతులు నిరాశ చెందారు. ఇప్పటికైనా సాగర్ నుంచి, ఎత్తిపోతల పథకం నుంచి కాని, యుద్ధ ప్రాతిపదికన నీరు విడుదల చేసి, పంటలను కాపాడాలని, మరో 10 రోజుల తర్వాత, సాగునీరు వదిలినా ఉపయోగం ఉండదని, రైతులు ఆందోళన చెందుతున్నారు.



## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి





చివ్వెంల ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

**చివ్వెంల, మార్చి 27 :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 202, 203 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, మాట్లాడారు. మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల వివరాలను ఏఎంఎఫ్, బీఎంఎఫ్‌ల గురించి తహసీల్దార్ కృష్ణయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవోలు హరిసింగ్, గోపి, డీఈ పాండునాయక్, ఏఈలు మౌనిక, మణికంఠ, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**నీటిఎద్దడి లేకుండా చూడాలి**

**మోతె:** వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటరావు ఆదేశించారు. నామవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండలంలోని 29 గ్రామాల్లో నీటిఎద్దడిపై ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌ని అడిగితెలుసుకున్నారు. కార్యదర్శులు గ్రామాల్లో సమయం కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తాగునీటికి ఏర్పాటుచేసిన బోరును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సంఘమిత్ర, కార్యదర్శులు పాల్గొన్నారు.

## కోడ్ అమలుకు మీడియా సహకరించాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

**సూర్యాపేటఅర్బన్, మార్చి 27:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు, మీడియా సహకరించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు, మీడియా సమన్వయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు రూ.2 కోట్ల విలువైన నగదు, అభరణాలు సీజ్ చేశామన్నారు. అన్నిరకాల అనుమతులు ఉన్న వాటిని వెంటనే విడుదల చేశామన్నారు. అంతర్‌రాష్ట్ర, అంతర్‌జిల్లా సరిహద్దుల అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల కోడ్ అమలులో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బంది, పోలీస్ వాహనాల పార్కింగ్ కోసం నిర్మించిన షెడ్‌ను ఎస్పీ రాహుల్‌హెగ్డే ప్రారంభించారు.

## ఎండుతున్న పంటలకు మంత్రులదే బాధ్యత

**పెన్‌పహడ్, మార్చి 27 :** ఉమ్మడి జిల్లాలో ఎండిపోయిన వరి పంటలకు జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు బాధ్యత వహించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాచారం గ్రామంలోని రావి చెరువు, ఎండిపోయిన వరి పంటలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. సాగునీరు రైతులకు ఎలా అందించాలో అవగాహన మంత్రులకు లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రావిచెరువుతో పాటుగా నియోజకవర్గంలో అన్ని చెరువులను గోదావరి జలాలతో నింపి రైతులకు సాగునీటి కొరత లేకుండా చూశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెరువులు ఎండిపోయి నెర్రెలు వచ్చాయని అని ఆయన ఎద్దేవా చేశారు. సూర్యాపేట నియోజకవర్గంలో సుమారుగా 25 వేల ఎకరాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల ఎకరాల వరి పొలాలు ఎండిపోవడంతో రైతులు దివాలా తీసే పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు ఇస్తాం పంటలు వేసుకోవాలని, రైతులు భరోసా కల్పించడంతో వారి మాటలు నమ్మి రైతులు సేద్యం చేశారన్నారు. రైతులు అప్పులు చేసి సేద్యం చేస్తే పెట్టుబడి డబ్బులు కూడా చేతికి రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లోకి మంత్రులు వస్తే రైతులు నిలదీస్తారనే ఉద్దేశంతో రెండు వారాలుగా కనిపించకుండా పోయారని ఆయన విమర్శించారు. ఇదే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే రైతులకు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. బ్యాంకు రుణాలు మాఫీ చేయకపోనూ రైతుబంధు డబ్బులు నేటి వరకు రాకపోవడంతో రైతులు నిరాశతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులలో పూర్తి వ్యతిరేక వచ్చిందన్నారు.



మాచారంలో ఎండిపోయిన రావిచెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

## ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లు

- డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు

**నడిగూడెం, మార్చి 27:** జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభిస్తామని, ఇందుకోసం 221 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీవో పీడీ మధుసూదన్‌రాజు తెలిపారు. బుధవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాఖల పరిధిలో 158, మిగిలినవి సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. 2023-24లో 50 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా ఉన్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 475 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నామని, 36,180 మంది కూలీలు రోజు వారీ పనులకు హాజరవుతున్నట్లు వివరించారు. ప్రతీ కూలీ బ్యాంకు ఖాతాతో ఆధార్‌కార్డును లింక్ చేసుకోవాలన్నారు. ఈ ఏడాది చెరువుల పూడిక, పంట కాల్వలు, చెక్ డ్యాం పూడిక పనులు చేపడుతున్నట్లు తెలిపారు.





సామాజిక తనిఖీల్లో పనుల వివరాలు తెలుసుకుంటున్న పీడీ మధుసూదన్‌రాజు

**పక్కాగా ఉపాధి రికార్డులు**

ఉపాధిహామీ పనుల రికార్డులు నిబంధనల మేరకు పక్కాగా ఉండాలని డీఆర్‌డీవో పీడీ మధుసూదన్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీ రికార్డులు, చెక్కులు, కొలతలు సమగ్రంగా ఉండాలన్నారు. కూలీలకు చెల్లింపులు సకాలంలో జరగాలన్నారు. మండలంలోని 15 గ్రామాల్లో చేపట్టిన పనులపై విచారణ నివేదికను సభలో నివేదించారు. 2022 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై తనిఖీ నిర్వహించారు. మొత్తం 316 పనులపై సమగ్ర నివేదిక ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ డీ శిరీష, అంబుడ్స్‌మెన్ లచ్చిరాంనాయక్, విజిలెన్స్ అధికారి ఆశా లత, సహాయ విజిలెన్స్ అధికారి వై.లింగారెడ్డి, ఎంపీడీవో ఇమాం, సీఈవోలు విజయ్, రాకేష్, ఏపీవోలు శ్రీనివాస్‌రాజు, నగేష్, ఈసీ శ్రీనివాస్, ఎస్ఆర్పీ, డీఆర్‌పీ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైబ్రెంట్ తెలంగాణ
**అమలైతే..**

- తెలంగాణ-2050 ప్రణాళికలో రూరల్ పరిధిలోకి సూర్యాపేట జిల్లా
- ఎన్నికలు పూర్తయ్యాక పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళిక
- సమూల మార్పు దిశగా ఆలోచన 7

**వేలం డబ్బు వసూలు చేయని మత్స్యశాఖ**

- జిల్లాలో నాలుగు చెరువులకు మాత్రమే వేలం ప్రక్రియ పూర్తి
- వేలం డబ్బులు ఇవ్వని కాంట్రాక్టర్లు
- మిన్నకుంటున్న అధికారులు 8

## నాటక సాహిత్యంపై పరిశోధనలు పెరగాలి

- సాహిత్య పరిశోధకులు సుంకిరెడ్డి నారాయణరెడ్డి

**నల్లగొండ కల్చరల్, మార్చి 27:** నాటక సాహిత్యంపై పరిశోధనలు పెరగాలని సాహిత్య పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెండు రోజుల తెలుగు నాటకం - సాహిత్య సమాలోచన అనే అంశంపై తొలిరోజు నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాటక సాహిత్యంపై పరిశోధనలు జరగడం లేదని, ఇలాంటి సదస్సులు నాటక సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించేలా ఉంటాయన్నారు. విద్యార్థులను పరిశోధకులుగా, సాహిత్య అభిమానులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయన్నారు. చాలా మంది నాటక రచయితల రచనలు నేటి సాహిత్య లోకానికి అందడం లేదన్నారు. అలాంటివారి సాహిత్యాన్ని వెలికితీసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ఉత్తమ సినీ విమర్శక పురస్కార గ్రహీత డాక్టర్ ఎం.పురుషోత్తమచార్యులు మాట్లాడుతూ నాటక రచయితతో పాటు నటులు, నాటక ప్రయోక్తలందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఆ నాటకం జనరంజకం అవుతుందన్నారు. రమ్యమైన దృశ్య కావ్యమని ఇలాంటి కావ్యాలు రాసిన రచయితలు తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందారన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకర్‌శర్మ మాట్లాడుతూ నాటకరంగం మనోరంజకమైనదని నేడు సినిమాల ప్రభావంతో నాటకరంగ సంస్థలు కనుమరుగైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య కర్నిల్ల లావణ్య, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ కౌండిన్య, లవేందర్‌రెడ్డి, వెల్దండి శ్రీధర్, గోవర్ధన గిరి, ప్రభాకర్, లింగస్వామి, రమ్య, అంజయ్య, దుర్గాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



నల్లగొండలో నిర్వహించిన సాహిత్య సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి

# బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మోత్కూరు, మార్చి 27: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో అధికారులు బుధవారం బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికకు వివాహం చేస్తున్నారని తెలుసుకున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కవిత, ఏఎస్ఐ వెంకన్న, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ దశరథ ఆ గ్రామానికి చేరుకుని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపి వేయించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాల్య వివాహ నిరోధక చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. బాలికను, ఆమె తల్లిదండ్రులను జిల్లా బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరుపర్చారు. బాల్య వివాహాలు చేయిస్తున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

# యాదగిరిగుట్ట ఆలయం అద్భుతం

● భారత నావికా దళాధిపతి అడ్మిరల్ హరికుమార్

భువనగిరి అర్బన్, మార్చి 27: యాదగిరిగుట్ట ఆలయం అత్యద్భుతంగా నిర్మితమైందని, తాను సందర్శించిన ఆలయాల్లోకెల్లా ఇక్కడి ఆలయం శిల్పకళా సౌందర్యంతో భక్తి భావం పెంపొందిస్తోందని భారత నావికా దళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ అభివర్ణించారు. బుధవారం యాదగిరిగుట్ట క్షేత్రాన్ని ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేయగా, ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిరల్ హరికుమార్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణశైలిలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందన్నారు. స్వామిని దర్శించుకున్న పవిత్ర అనుభూతి కలిగిందన్నారు. ఈవోను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆలయ నిర్వహణ తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



హరికుమార్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

● యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో ఘటన



పంచాయతీ కార్యదర్శి కిరణ్

**మోత్కూరు, మార్చి 27:** ఇంటి పన్ను నిర్ధారిత ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు రూ.3వేలు లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు చిక్కాడు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడులో ఈ సంఘటన జరిగిం ది. ఇందుకు సంబంధించిన వివరా లను ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపారు. మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన గొరిగె మహేష్ నూతనంగా నిర్మించుకున్న ఇంటికి పన్ను నిర్ధారిత ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం కార్యదర్శి చిన్నం కిరణ్ లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా, మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు కార్యదర్శి కిరణ్‌కు రూ.3వేలు లంచం ఇస్తుండగా అదుపులోకి తీసుకు న్నట్లు డీఎస్పీ తెలిపారు. కిరణ్‌ను ఏసీబీ కోర్టులో ఫస్ట్‌క్లాస్ అదనపు స్పెషల్ జడ్జి ఎదుట హాజరు పర్చుతామన్నారు. బాధితుడు మహేష్ మాట్లాడుతూ పంచా యతీ కార్యదర్శి తనను రూ.8వేలు డిమాండ్ చేయగా, రూ.5వేలు పంచాయతీ కారోబార్ బంగారి ద్వారా పంపించానన్నారు. కిరణ్ తనను వదలకుండా మిగతా రూ.3వేలు ఇవ్వాలని పదే పదే అడుగుతుండటంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు.

## పట్టపగలు ఇంట్లో చోరీ

**దేవరకొండ, మార్చి 27:** నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణం హనుమాన్ నగర్‌లోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్‌లోని శ్రీనివాస్‌రావు అనే పెయింటింగ్ కాంట్రాక్టర్ ఇంట్లో కుటుంబ సభ్యులు ఇంట్లోలేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు అపహరించారు. శ్రీనివాసరావు పెయింటింగ్ కాంట్రాక్టర్ కాగా పనిమీద బయటకు వెళ్లాడు. ఆయన భార్య కూడా కొండమల్లేపల్లికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు బాధితుడు శ్రీనివాసరావు తెలిపారు. గమనించిన ఇరుగు, పొరుగువారు శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

## ఎలక్ట్రికల్ షాప్‌లో అగ్ని ప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన సామగ్రి

**భూదాన్‌పోచంపల్లి, మార్చి 27:** యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఎలక్ట్రికల్ షాప్ లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సీత శేఖర్ మంగళవారం రాత్రి 9గంటలకు తన ఎలక్ట్రికల్ దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10:30 గంటల సమయంలో దుకాణం పక్కనే ఉన్న చికెన్ షాప్ యజమాని ఫోన్ చేసి ఎలక్ట్రికల్ షాప్ నుంచి మంటలు వస్తున్నాయని శేఖర్‌కు సమాచారం ఇచ్చాడు. శేఖర్ వచ్చి చేసే సరికి దుకాణం పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సాయంతో మంటలు ఆర్పారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.6లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు శేఖర్ తెలిపారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**అర్వపల్లి:** సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోళ్ల మహేందర్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం దగ్ధమైంది. సూర్యాపేట నుంచి వచ్చిన ఫైరింజన్‌తో మంటలు ఆర్పారు. ఇంట్లో ఉన్న ఫ్యాన్లు, టీవీ, ఫ్రిజ్, బియ్యం బస్తాలు, ధాన్యం బస్తాలు, దుస్తులు, నగదు రూ.లక్ష పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

**మిర్యాలగూడ అర్బన్, మార్చి 27:** హైటెక్‌హంగుల తెరవెనుక గుట్టుగా సాగిపోతున్న వ్యబిచారంపై పోలీసులు దృష్టిసారించారు. ఏపీ రాష్ట్రసరిహద్దులో ఉన్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో కొందరు మహిళలు విటులను రప్పించి వలపు వల వేస్తున్నారు. విటులను ఆకర్షించేందుకు వాట్సాప్ ఇతర సోషల్‌మిడియా మార్గాల్లో స్మార్ట్‌గా వల వేస్తున్నారు. పట్టణ శివారు కాలనీలో విసిరేసినట్లుగా ఉండే భవాలను అద్దెకు తీసుకొని వ్యభిచారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 20- 35 ఏళ్లలోపు యువతులతో వ్యబిచారం సాగిస్తున్నట్లుగా పోలీసులకు విశ్వసనీయంగా సమాచారం అందింది. దీంతో బుధవారం నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలలో వన్‌టౌన్ పోలీసులు ఆకస్మికంగా దాడిచేశారు. ఓ మూడు ఇండ్లలో ఉన్న 10మంది మహిళలతోపాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ వ్యవహారం ఎప్పటి నుంచి నడుస్తుంది..? దీనివెనుక ఉన్న సూత్ర, పాత్రదారులెవరు.. ఎక్కడెక్కడినుంచి విటులను రప్పిస్తున్నారు..? పట్టుబడ్డ యువతులు ఏ ప్రాంతానికి చెందినవారన్న దానిపై లోతైన విచారణ సాగిస్తున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. విచారణ పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

## రూ.లక్ష నగదు స్వాధీనం



విచారణ నిర్వహిస్తున్న పోలీసులు

**పెన్‌పహాడ్, మార్చి 27:** సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పెన్‌పహాడ్ ఎస్ రవీందర్ తన పోలీస్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. గరిడేపల్లి నుంచి మహబూబబాద్ జిల్లా మర్రిపేట వెళ్తున్న కారులో ఎలాంటి పత్రాలు లేకుండా లక్ష రూపాయలు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే ఆ నగదు పట్టుబడితే సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్‌పహాడ్ పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

## లైంగికదాడి ఘటనలో నిందితుడి రిమాండ్


**చౌటుప్పల్ రూరల్, మార్చి 27:** ఆడిస్తానంటూ తీసుకెళ్లి.. రెండేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చౌటుప్పల్ కోర్టులో హాజరుపెట్టిన అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 25 ఏళ్ల శివ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే ఓ గదిలో ఉంటున్నాడు. అక్కడే ఉంటున్న దంపతుల రెండేళ్ల బాలికను ఆడిస్తానంటూ సోమవారం సాయంత్రం తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. చిన్నారిని ఇంటి సమీపంలో వదిలివెళ్లటంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శివను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. చిన్నారి నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతోందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

**తిరుమలగిరి(సాగర్), మార్చి 27:** నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని మండలంలోని అల్వాల గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. బాధిత రైతు రావులపాటి సైదులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సైదులు పాడి గేదెను పెంచుకుంటూ పాల ద్వారా తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే మేతకు వెళ్లిన గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుష్ వైర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని సైదులు కోరాడు.

# వైబ్రెంట్ తెలంగాణ అమలైతే..

» రూరల్ తెలంగాణ పరిధిలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు? » యాదాద్రి సగం జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలోకి » మిగితా సగం రూరల్‌గా




**భువనగిరి టౌన్, మార్చి 27:** దేశంలో 29వ రాష్ట్రంగా పదేళ్ల క్రితం ఏర్పడిన తెలంగాణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైబ్రెంట్ తెలంగాణ- 2050 ప్రణాళికలు రూపొందిస్తోం ది. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. అలాగే ఇటీవల వరకు విస్తృతంగా ప్రచారం జరిగి న గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్) లోపలి వైపున్న ప్రాంతాలన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోకి, ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యలో ఉన్న ప్రాంతాలు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ ఆథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోకి వెళ్లనున్నాయి. ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా రాష్ట్ర ప్రభుత్వం పరిగణించనుంది. దీంతో హైదరాబాద్ నగర పరిధిని విస్తృతం చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎనిమిది మండలాలను లేదా మూడు మునిసిపాలిటీలను కలుపుతూ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు కానుందని ఇటీవలి వరకు విస్తృత ప్రచారం జరిగినా ఇప్పటికిప్పుడు ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేదని స్పష్టమవుతోంది.

### ప్రభుత్వ ఆలోచన నిజమైతే..

వైబ్రెంట్ తెలంగాణ -2050 ప్రణాళిక నిజమైతే ఉమ్మడి జిల్లా సత్వర అభివృద్ధికి చెందుతుందని పలు రంగాల నిపుణులు అంటున్నారు. ఇప్పటి వరకు పలు కారణాలతో అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలన్నింటినీ అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రతిపాదిస్తున్న వైబ్రెంట్ తెలంగాణ-2050తో ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తారని, అందుకు అవసరమైన నిధుల కేటాయింపు, మంజూరు సులభతరం అవుతుందని అంటున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాను రూరల్ తెలంగాణ, హెచ్‌ఎండీఏ కేటగిరీలుగా పరిగణించనున్న నేపథ్యంలో పాలన పరమైన, రాజకీయ, భౌగోళిక, జిల్లాల ముఖ చిత్రాలు కూడా మారే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. జూన్ 6తో ముగిసే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అనంతరమే ప్రభుత్వ నూతన ప్రణాళికపై స్పష్టత రానుంది.

**ఇటీవల సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు**



ఔటర్ రింగురోడ్డు లోపలి వైపు ఉన్న సిటీ మొత్తాన్ని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోకి తీసుకొస్తామని, ఔటర్ నుంచి రీజినల్ రింగురోడ్డు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకొస్తామని సీఎం ప్రకటించారు. రీజినల్ రింగు రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణించి అభివృద్ధి చేస్తామని వివరించారు. వైబ్రెంట్ తెలంగాణ-2050 సాధనే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేస్తామని ప్రకటించారు.

**మారనున్న ఉమ్మడి జిల్లా స్వరూపం...?**

వైబ్రెంట్ తెలంగాణ-2050 సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికతో ఉమ్మడి జిల్లా సమగ్ర స్వరూపం మారనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు కార్యరూపం వస్తే పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసే నాటికి రూపొందించనున్న ప్రణాళికలతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు రూరల్ తెలంగాణ పరిధిలోకి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండాలాల్లో 8 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోని మిగతా 9 మండలాలు రూరల్ తెలంగాణలోకి వెళ్లనున్నాయి. కానీ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని ఏ ఒక్క ప్రాంతం కూడా విలీనం అయ్యే అవకాశాలు లేనట్లేనని ప్రచారం అవుతోంది. అలాగే జిల్లాల పునర్విభజన కూడా సక్రమంగా జరగలేదని నేటి ప్రభుత్వం ఇటీవల సీఎం పలుమార్లు పేర్కొన్న నేపథ్యంలో వైబ్రెంట్ తెలంగాణ-2050 ప్రణాళికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రణాళికలో భాగంగా మరోమారు జిల్లాల పునర్విభజనకు కూడా అవకాశాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది.

**చిత్తశుద్ధి ఉంటే లక్ష్యం సాధ్యమే**



రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదిస్తున్న వైబ్రేంట్ తెలంగాణ -2050 ప్రణాళిక మంచిదే. కానీ పాలకులకు చిత్తశుద్ధి ఉంటేనే ప్రణాళిక అమలు సాధ్యం. ప్రణాళిక అమలుకు ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. కానీ పాలనకంటే రాజకీయమే ముఖ్యమని ఇటీవలి వరకు రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగిన విషయం విదితమే. తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అవే రాజకీయ బేధాభిప్రాయాలు కొనసాగితే మాత్రం నూతన ప్రణాళిక విఫల ప్రయోగంగా మిగులుతుంది.

- సింగనబోయిన సత్యానారాయణ, విశ్రాంత మునిసిపల్ కమిషనర్.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

**కోదాడటౌన్, మోతె, పెద్దవూర, మఠంపల్లి, మార్చి 27:** ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో జరిగిన మరో ప్రమాదంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి వాసి మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం సమీపంలోని ఎస్ఆర్ఎం పాఠశాల వద్ద మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అర్ధరాత్రి కావడంతో మృతదేహాన్ని గుర్తించకుండా వాహనాలు వెళ్లడంతో శరీరం నుజ్జు నుజ్జయింది. బుధవారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ రాము తెలిపారు. షార్ట్ మినహా, శరీరంపై చొక్కా ఆనవాలు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహన్ని ఉంచినట్లు తెలిపారు. గుర్తుతెలియని మృతదేహం కింద కేసు నమోదు చేస్తు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని..**

సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు వెంట ఆగిఉన్న వాహనాన్ని వెనకాల నుంచి బైక్ ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఏపీ రాష్ట్రం కృష్ణాజిల్లా నందివాడ గ్రామానికి చెందిన ఉండవల్లి నవీన్‌కుమార్(25) చౌటుప్పల్ పరిధిలోని దివీస్ లాబోరేటరి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కంపెనీ సమీపంలోనే ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన తన స్నేహితుడు కె. శివ వంశీరబ్బర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శివను ఖమ్మంలో బైక్‌పై వదిలివెళ్లడానికి ఇద్దరు కలిసి మంగళవారం బయలుదేరారు. బుధవారం తనకు డ్యూటీ ఉండడంతో ఖమ్మంలో శివను వదిలి తెల్లవారుజామున ఖమ్మం నుంచి అదే బైక్‌పై వస్తుండగా మోతె గ్రామ శివారులో ఉన్న ఫ్లైఓవర్ వద్ద రోడ్డు వెంట ఆగి ఉన్న లారీని వెనకాల ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో గాయాలైన నవీన్‌ను సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు బుధవారం సాయంత్రం మృతిచెందాడు నవీన్ సోదరుడు ఉండవల్లి వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

**కారు ఢీకొని యువకుడు..**



పోలెపల్లి గోపి(ఫైల్)

నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం బోయగూడెం గ్రామానికి చెందిన పోలెపల్లి గోపి(27), కటికల మధు టీఎస్ 05ఎఫ్‌హెచ్9326 నెంబర్‌గల బైక్‌పై బోయగూడెం నుంచి మల్లేపల్లి వైపు వెళ్తున్నారు. పెద్దవూర మండల కేంద్రంలోని కాటన్‌మిల్లు వద్ద జాతీయ రహదారి-167 సమీపంలోకి రాగానే హైదరాబాద్‌కు చెందిన అవుతు కోటిరెడ్డి హైదరాబాద్ నుంచి అజాగ్రత్తగా అతి వేగంగా కారును నడుపుతూ బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో గోపి, మధు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పోలేపల్లి గోపి(27) మృతిచెందాడు. గాయపడిన కటికల మధును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. గోపికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోపి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దవూర ఎస్ఐ వీరబాబు తెలిపారు.

**వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం.. మఠంపల్లి వాసి మృతి**



మోహన్ (ఫైల్)

వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల వాసి మృతిచెందాడు. మఠంపల్లి మండలంలోని ఉమ్మడి భీల్యానాయక్‌తండా పరిధిలో గల బక్కులచ్చితండాకు చెందిన బానోతు మోహన్(35) వృత్తిరీత్యా లారీ డ్రైవర్ పని చేస్తుండేవాడు. స్థానిక సాగర్ సిమెంట్స్ నుంచి మంగళవారం లారీ లోడుతో బయలు దేరిన మోహన్ బుధవారం వరంగల్- కరీంనగర్ ప్రధాన రహదారిపై గేదెలను తప్పించబోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోహన్ శరీర భాగం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో భీల్యానాయక్‌తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మోహన్‌కు భార్య సుజాత, ఇద్దరు పిల్లులు ఉన్నారు.

## మేకను కాపాడబోయి..

**యాదగిరిగుట్ట రూరల్, మార్చి 27:** మేకను కాపాడ బోయి చేపల చెరువులో పడి యవకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మం డలంలోని మల్లాపురం గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రె నర్సింహులు, పారిజాత దంపతుల పెద్ద కుమారుడు నవీన్(27) తన వ్యవసాయ బావి సమీపంలో హైదరాబాద్‌కు చెందిన రఫీ అనే వ్యక్తికి చెందిన చేపల చెరువు ఉంది. తన మేక చెరువులోకి వెళ్లిందని దానిని తీసుకరావడానికి నవీన్ చెరువులోకి దిగాడు. చెరువు లోతుగా ఉండడంతో ఈతరాని చెరువులో మునిగి ఊపికాడక అందులోనే మృతిచెందాడు. వ్యవసాయ బావివద్దనే ఉన్న తల్లిదండ్రులు గమనించి తమ కుమారుడు ఇప్పటి వరకు రాలేదని చెరువు వద్దకు వెళ్లి చూసేసరికి చెరువులో నుంచి మేక బయటకు వచ్చింది. నవీన్ చెరువులోనే పడిపోయాడని వారు కేకలు వేయడంతో అక్క డున్న వారు వచ్చి చెరువులో గాలించినా అతని జాడ దొరకలేదు. వెంటనే జేసీబీ ద్వారా చెరువుకట్టకు గండిపెట్టారు. దీంతో చెరువులోని నీరు బయటకు వెళ్లిపోవడం తో చెరువులో నవీన్ మృతదేహం లభించింది. మృతదే హాన్ని బయటకు తీసి దహనసంస్కారాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.



యువకుడు పడి మృతిచెందిన చేపల చెరువు

నవీన్(ఫైల్)

## విద్యుదాఘతంతో వృద్ధుడు మృతి

**పాలకవీడు, మార్చి27:** విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ దర్గా గ్రామానికి చెందిన సాదినేని రోషయ్య(93) వృద్ధాప్యంతో మతిస్థిమితం సరిగాలేదు. అదే గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రోషయ్యకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రోషయ్య కుమారుడు సాదినేని జగ్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

**పాలకవీడు, మార్చి27:** వేర్వేరు కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సిరాన్ భూయాన్(23) డీడీసీఎల్ ఏజెన్సీ ద్వారా సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ కర్మాగారంలో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. సిరాన్ భూయాన్‌కు ఇటీవల పెళ్లి కుదిరింది. పెళ్లి ఇష్టం లేదని అదే ఏజెన్సీలో పనిచేసే సోదరుడు వరసయ్యే రాజ్‌దీప్‌కు, ఇతరులకు తరచూ చెప్తూ ఉండేవాడు. మంగళవారం సాయంత్రం కూడా అలాగే చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో బుధవారం ఉదయం సోదరుడు రాజ్‌దీప్, కొంత మంది కార్మికులతో కలిసి వెతకగా రావిపహాడ్ గ్రామ శివారులోని ఫారెస్ట్‌లో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. సోదరుడు రాజ్‌దీప్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు హుజూర్‌నగర్ ఏరియాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

**జీవితంపై విరక్తి చెంది..**

**ఆత్మకూరు(ఎం):** చేయడానికి సరైన పని దొరకడం లేదని జీవితం మీద విరక్తిచెంది పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పట్టూరి శేఖర్ రెండో కుమారుడు పట్టూరి శివ(26) గత కొంత కాలంగా ఏపని చేయకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. శివ కొన్ని రోజులు మండల కేంద్రంలోని గ్రోమోరు కేంద్రంలో పనిచేశాడు. అక్కడ పని మానేసి ఖాళీగానే ఇంటివద్ద ఉంటున్నాడు. రోజు మాదిగానే మంగళవారం రాత్రి కూడా శివ ఇంటి దాబాపై పడుకున్నాడు. అప్పటికే పురుగుల మందు తెచ్చిపెట్టున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగిన శివ తల్లికి తెలిపాడు. అప్పటికే అపస్మారక స్థితిలో పడిఉన్న శివను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. శివ తల్లి పట్టూరి కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎండీ. యాకూబ్‌ఖాన్ తెలిపారు.

**అనారోగ్య సమస్యలతో**

**చౌటుప్పల్ రూరల్:** యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ లో గల అద్దె గదిలో బుధవారం దివీస్ కంపనీ ఉద్యోగి కొరెపల్లి సంజయ్(25) అనారోగ్య సమస్యలతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన సంజయ్ నాలుగు మాసాలుగా దివీస్ కంపనీ లో ఉద్యోగం చేస్తున్నాడని సీఐ తెలిపారు. సంజయ్ మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పాముకాటుతో పదో తరగతి విద్యార్థి మృతి

**మోత్కూరు, మార్చి 27:** తమ కుమారుడు పదో తరగతి పరీక్షలు ఉత్సాహంగా రాస్తున్నాడు.. పరీక్షలు ముగిస్తే సెలవులు, ఆ తర్వాత ఇంటర్‌లో చేర్పించాలన్న తల్లిదండ్రుల కలలపై పాము విషం చిమ్మింది. పాముకాటుతో విద్యార్థి బంగారు భవిష్యత్ కరిగిపోయి, తల్లిదండ్రుల కల చెదిరిపోయి పుట్టెడు శోకంలో మునిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ముక్కెర్ల కుమార్, మమత దంపతుల కుమారుడు ఉమేష్(16) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 18 నుంచి మోత్కూరులోని పరీక్ష కేంద్రానికి వెళ్లి వార్షిక పరీక్షలు రాస్తున్నాడు. ఇప్పటికే నాలుగు పరీక్షలు పూర్తయ్యాయి. మంగళవారం పరీక్ష రాసి వచ్చిన ఉమేష్ రాత్రి పొద్దుపోయే వరకూ గురువారం నాటి పరీక్షకోసం చదువుకున్నాడు. ఆ తర్వాత తల్లిదండ్రులు, తోబుట్టువుల పక్కన నేల మీద పడుకున్నాడు. రాత్రి నిద్రలో కట్ల పాము ఎప్పుడు కాటేసిందో ఎవరూ గమనించలేదు. అర్ధరాత్రి దాటాక ఉమేష్ లేచి కూర్చుని తల్లిదండ్రులను లేపి తనకు నలతగా ఉందని చెప్పాడు. ఇంతలో వాంతులు చేసుకున్నాడు. తనను ఏదో కరిచినట్టు అనిపించిందని చెప్పాడు. దీంతో వారు ఇంట్లో వెతకగా కట్ల పాము కనిపించింది. వెంటనే దాన్ని కొట్టి చంపారు. ఉమేష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరో సారి వాంతి చేసుకుని మృతి చెందాడు. మమత, కుమార్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా ఉమేష్ పెద్దవాడు. ఈ సంఘటనతో దత్తప్పగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సహచర విద్యార్థులు బుధవారం సాయంత్రం నిర్వహించిన ఉమేష్ అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలిపారు.



ఉమేష్(ఫైల్)

## ఎక్కడ చూసినా కన్నీటి గోసే

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లెదుటే ఎండుతుంటే అన్నదాతలు గోస పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో కొన్ని గ్రామాల రైతులకు మూసి నీరే పంట పొలాలకు జీవనాధారం. మూసీకి ఆనుకొని ఉన్న మగ్దుంపల్లి వంటి గ్రామాలు అనావృష్టి వల్ల ఎడారిగా మారింది. ఎప్పుడూ గలగల పారే మూసీ ఈ వేసవిలో పంటలకు నీరందక ఎండిపోయాయి. పదుల సంఖ్యలో మోటార్లు పడావుగా మారాయి. చేసేదేమీ లేక రైతులు తమ మోటార్లను ఒక్కొక్కటిగా ఇళ్లకు తరలిస్తున్నారు. ఈ సారీ నీరందక పూర్తిగా పంట నష్టం వాటిల్లి జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి



బీబీనగర్ మండలం మగ్దుంపల్లి గ్రామంలో మూసీనది ఎడారిగా మారడంతో నిరుపయోగంగా పంటపొలాల మోటార్లు, మోటర్ తీసుకెళ్తున్న రైతు



మగ్దుంపల్లి గ్రామంలో ఎండిన వరి పొలం



## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**నడిగూడెం, మార్చి 27:** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది ఎం.రాజారాం అన్నారు. బాలికల సాధికారతపై బుధవారం నడిగూడెం గురుకుల పాఠశాల విదార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, బాలికలు న్యాయశాస్త్రాన్ని తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని, ఎంఎస్ విద్యా సంస్థల సీఈవో శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మి, రవికృష్ణ, వెంకటేశ్వర్లు, రజిని, సుజాత పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**హుజూర్‌నగర్, మార్చి 27:** పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణం, వేపలసింగారం, బూరుగడ్డ గ్రామాల్లో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్‌లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య, పోలీసులు, మిలటరీ బలగాలు పాల్గొన్నాయి.

## పార్లమెంటు స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

**హుజూర్‌నగర్, మార్చి 27:** మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామంలో ఈనెల 30న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రతినిధులు దొంగరి వెంకటేశ్వర్లు, అల్లం ప్రభాకర్‌రెడ్డి, ఈడ్పుగంటి సుబ్బారావు కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌చౌదరి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో తన్నీరు మల్లికార్జున్‌రావు, గొట్టె వెంకట్రామయ్య, గల్లా వెంకటేశ్వర్లు, శ్రావణ్, సంపత్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ధాన్యం కొనుగోలులో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

**సూర్యాపేట అర్బన్, మార్చి 27:** నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సహకార సంఘంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్ మలిగిరెడ్డి రమణారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. 2020-21 సంవత్సరానికి ఐకేపీల ద్వారా ధాన్యం కొనుగోలు చిల్లేపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉండగా, అప్పటి సంఘ చైర్మన్, సీఈవో, మిల్లు యజమానులు కుమ్మక్కై వేరే ప్రాంత రైతుల పేరిట ట్రక్కు షీట్లు, బిల్లులు తయారు చేసి రూ.2కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మలిగిరెడ్డి హేమలత, రంగారెడ్డి, పల్లా వెంకన్న, ముత్తమ్మ, గోవింద పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎంపీటీసీలు క్రాంతికుమార్, సౌజన్య

**కోదాడ రూరల్, మార్చి 27:** మండలంలోని నల్లబండగూడెం ఎంపీటీసీ యరమాల క్రాంతికుమార్, చిమిర్యాల ఎంపీటీసీ కలకొండ సౌజన్య బీఆర్ఎస్‌కు బుధవారం రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్, సౌజన్య మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మావతి నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకుని బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. మండలంలో పార్టీని మరింత పటిష్ఠం చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్తా గురవయ్య, ఇర్ల సీతారాంరెడ్డి, రెడ్డిపూడి అనంతరామయ్య, బీక్యాతండా మాజీ సర్పంచ్ అంబేడ్కర్, అమరనాయిని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**మద్దిరాల, మార్చి 27:** గ్రామాల్లో ప్రజలకు ఓటు హక్కుపై బీఎల్వోలు అవగాహన కల్పించాలని తహసీలార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు ఓటు హక్కుపై కల్పించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేసవిలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గ్రామాల్లో నివసించనివారిని గుర్తించి ఓటరు జాబితాలో వారి పేర్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామారావు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

## సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**మఠంపల్లి, మార్చి 27:** మండలోని మట్టపల్లి క్షేత్రంలో బుధవారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

**పెన్‌పహాడ్, మార్చి 27:** మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సయ్యద్ షాబుద్దీన్ ఈ నెల 21న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ షాబుద్దీన్ కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు జిల్లా సర్వోత్తమ్ రెడ్డి, వేణారెడ్డి, పార్టీ మండలఅధ్యక్షుడు తూముల సురేష్, మాజీ సర్పంచ్ షేక్ జానీమియా, సైదిరెడ్డి, శ్రీనివాస్, సయ్యద్ పాల్గొన్నారు.



# వేలం డబ్బు వసూలుచేయని మత్స్య శాఖ

**భానుపురి, మార్చి 27:** జిల్లాలో మత్స్యశాఖ సహకార సంఘాల పరిధిలోలేని గ్రామ పంచాయతీల అధీనంలో ఉన్న 96చెరువులు, కుంటలకు జిల్లా మత్స్యశాఖ, పంచాయతీరాజ్ అధికారులు నెల రోజుల క్రితం వేలం పాటలు నిర్వహించారు. 96చెరువుల్లో నాలుగు చెరువులకే కాంట్రాక్టర్లు పాట పాడారు. పాట పాడిన కాంట్రాక్టర్ల నుంచి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సూర్యాపేట పట్టణంలోని దాసాయి చెరువుకు రెండుసార్లు వేలం పాటలు నిర్వహించారు. మొదట ఓ కాంట్రాక్టర్ రూ.4లక్షలకు పాట పాడారు. డబ్బులు చెల్లించలేదని రెండోసారి వేలం పాట నిర్వహిస్తే మరో కాంట్రాక్టర్ రూ.10లక్షలకు పాట పాడారు. ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని, అధికారులు కూడా మిన్నకుండటం వెనుక మతలబు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దాసాయిగూడెంలోని కల్లెవారికుంటకు రూ.43 వేలు, చివ్వెంల మండలంలోని తిరుమలగిరిలోని ఊర చెరువుకు రూ.2.30 లక్షలు, గుంపులలోని తుమ్మలచెరువుకు రూ.40వేలు మాత్రమే వసూళ్లు అయ్యాయని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.



సూర్యాపేట వేలం పాటలో పాల్గొన్న అధికారులు(ఫైల్ ఫొటో)

**వసూలు చేయాలని ఆదేశిస్తాం**

వేలం పాట పాడిన అన్ని చెరువులకు డబ్బులు వసూలు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశిస్తాం. డబ్బులు వసూలు చేయడానికి అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో అడిగి తెలుసుకుంటాం. గ్రామ పంచాయతీల నుంచి కూడా ఫిర్యాదు చేయాలి.

● ఎస్.లత, అదనపు కలెక్టర్

# జర్నలిస్టులను దూషించడం తగదు



అదనపు కలెక్టర్ బీఎస్. లతకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

**సూర్యాపేటఅర్బన్ మార్చి 27:** ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న జర్నలిస్టులను దూషించడం తగదని ఐక్య కార్యాచరణ జర్నలిస్టు సంఘం నాయకులు చలసాని శ్రీనివాసరావు, బంటు కృష్ణ అన్నారు. జర్నలిస్టులపై అనుచిత వాఖ్యలు చేసిన ఐఎంఏ సంఘం సభ్యులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటరు నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మీడియాను నల్లగొర్రెలతో పోల్చడంతో పాటు తస్మాత్ జాగ్రత్త అంటూ బెదిరింపు ధోరణితో ప్రకటన విడుదల చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల జర్నలిస్టులు ఐతగాని రాంబాబుగౌడ్, నాయిని శ్రీనివాస్, కందుకూరి యాదగిరి, చంద్రశేఖర్, బుక్కా రాంబాబు, ఏల్క సైదులు, ఊట్కూరి రవీందర్, రాపర్తి మహేష్, మల్లికార్జున్, మల్లేష్, ఏడ్ల వేణుధర్ పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**సూర్యాపేట అర్బన్, మార్చి 27:** జిల్లాలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మాస్‌లైన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ బీఎస్.లతకు బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో ప్రాజెక్టుల్లో నీరు లేక జిల్లాలో పైర్లు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంటల పెట్టుబి కోసం చేసిన అప్పులను రైతులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, వీరబోయిన రమేష్, రేణుక, ఎస్‌కే గులాం, వాజిద్, బన్ని పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ సభ్యులు

# రంగస్థల కళాకారులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

**హుజూర్‌నగర్, మార్చి 27:** రాష్ట్ర ప్రభుత్వం రంగస్థల కళాకారులను ఆదుకోవాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ కోరారు. ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కళాకారుల ప్రదర్శనకు ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూర్చాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లలో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గోవింద్, రామారావు, ప్రసాద్, కిషోర్, వెంకటేశ్వర్లు, రాజారమేష్, శ్రీను, భద్రాచలం, రామారావు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలో బుధవారం ఆదర్శ కళామండలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టెముక్కల రాములు, రాళ్లబండి రామారావు, రాములుగౌడ్, జాన్‌సైదా, భద్రాచలం, గురవయ్య, అన్నమ్మ, శ్రీను, వెంకటేశ్వర్లు, కేశవులు పాల్గొన్నారు.

# మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలిగా గురవమ్మ ఎన్నిక

**కోదాడ రూరల్, మార్చి 27:** కోదాడ మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలిగా లిక్కి. గురవమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవి కోసం బుధవారం కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో సూర్యనారాయణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మొత్తం తొమ్మిది మంది ఎంపీటీసీలకు, ఐదుగురు హాజరయ్యారు. రెడ్లకుంట ఎంపీటీసీ, ఎంపీపీ మల్లెల రాణి, కాపుగల్లు ఎంపీటీసీ చలసాని శ్రీలత, గణపవరం ఎంపీటీసీ సింగారెడ్డి హిమబిందు, చిమిర్యాల ఎంపీటీసీ కలకొండ సౌజన్య, తొగర్రాయి ఎంపీటీసీ లిక్కి. గురవమ్మ, నల్లబండగూడెం ఎంపీటీసీ యరమాల క్రాంతికుమార్ హాజరయ్యారు. ఉపాధ్యక్ష పదవి కోసం లిక్కి. గురవమ్మ బరిలో ఉన్నందున ఆమెకు మద్దతు తెలిపేవారు చేతులు ఎత్తాలని ఆర్డీవో కోరారు. చేతు దీంతో ఐదుగురు ఎంపీటీసీలు గురవమ్మకు మద్దతుగా చెతులు ఎత్తారు. దీంతో కోదాడ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా తొగర్రాయి ఎంపీటీసీ లిక్కి. గురవమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. అనంతరం గురవమ్మతో ఆర్డీవో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



గురవమ్మతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణ

**గురవమ్మను అభినందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

కోదాడ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన లిక్కి. గురవమ్మను ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు ఇర్ల సీతారాంరెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేపూరి వెంకటాచారి, మందలపు శేషు, పట్టాభిరెడ్డి, మదన్మోహన్, ఎంపీటీసీలు హిమబిందు, కలకొండ సౌజన్య, చలసాని శ్రీలత , యరమాల క్రాంతికుమార్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

# అందరి సహకారంతో రెడ్డి సత్రాన్ని అభివృద్ధి చేస్తా



మట్టపల్లిలో ప్రమాణస్వీకారం చేస్తున్న రెడ్డి సత్రం కమిటీ సభ్యులు

**మఠంపల్లి, మార్చి 27:** అందరి సహాయసహకారాలతో మండలంలోని మట్టపల్లి మహాక్షేత్రంలో ఉన్న రెడ్డి అన్నదాన సత్రాన్ని అభివృద్ధి చేస్తానని ఆ సత్రం కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మట్టపల్లిలో జరిగిన రెడ్డి అన్నదాన సత్రం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రంలో సత్రం అభివృద్ధికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయకులు, పార్టీలకు అతీతంగా కులస్థులు తమవంతు సహకారాలు అందించాలని ఆయన కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, అధ్యక్షుడి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి చిట్టెం రెడ్డి నాగిరెడ్డి, కోశాధికారి వెంకటరెడ్డి, సత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్య శిక్షణతోనే యువతకు స్వయం ఉపాధి

**గరిడేపల్లి, మార్చి 27:** వ్యవసాయంతో పాటు ఇతర అనుబంధ రంగాల్లో యువత శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో సేంద్రీయ వ్యవసాయం, తేనె టీగల పెంపకంపై వారం రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన బుధవారం శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువత వ్యవసాయంతో పాటు ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలపై కూడా పట్టుసాధించాలన్నారు. ఉద్యాన, చేపలు, పట్టు పురుగులు, కోళ్ల పెంపకం తదితర రంగాల్లో సాంకేతిక శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి డి.నరేష్, శాస్త్రవేత్తలు సీహెచ్ నరేష్, ఏ.కిరణ్, ఎన్.సుగంధి, టి.మాధురి, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



యువతకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్

# ధర్మాపురం గ్రామంలో కొనసాగుతున్న వైద్యశిబిరం

**పెన్‌పహాడ్, మార్చి 27:** మండలంలోని ధర్మాపురం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం బుధవారం నాలుగో రోజుకు చేరింది. డెంగీతో ధర్మాపురం గ్రామంలో పలువురు మంచం పట్టడంతో డీఎంహెచ్‌వో కోటాచలం ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మురుగు కాల్వలు, నిల్వ ఉన్న నీటిలో గ్రామ పంచాయతీ సిబ్బందితో బీచ్లింగ్ పౌడర్ చల్లించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న గుండు అనసూర్య, గుండు రామన్నను సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి బుధవారం తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని పెన్‌పహాడ్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సైదులు కోరారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జాన్సీ, ఏఎన్ఎం సరిత, కార్యదర్శి సతీష్, ఆశా కార్యాకర్తలు సుమలత, విజయ, రమణ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలి

**గరిడేపల్లి, మార్చి 27:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని గరిడేపల్లి ఎస్ఐ ఈటె సైదులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదు తీసుకువెళ్లొద్దన్నారు. నిబంధలను అతిక్రమిస్తే డబ్బును సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి పంపుతామన్నారు. రూ.10లక్షలకు పైగా పట్టుబడితే ఆదాయ పన్ను అధికారులకు తెలియజేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సీజ్ చేసిన నగదు కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## 'యరబోలు రంగారెడ్డి మృతి బాధాకరం'

**గరిడేపల్లి, మార్చి 27:** పలు పార్టీల్లో పనిచేసిన యరబోలు రంగారెడ్డి మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఇటీవల మృతి చెందిన మండలంలోని రంగాపురం గ్రామానికి చెంది యరోబోలు రంగారెడ్డి చిత్రపటానికి జూలకంటి రంగారెడ్డి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రంగారెడ్డి తండ్రి యరబోలు లచ్చిరెడ్డి సీపీఎంలో ఉమ్మడి కీతవారిగూడెం, రాయినిగూడెం, బేతవోలు చిలకూరు ప్రాంతాల్లో దళాలను ఏర్పాటు చేసి అనేక పోరాటాలు చేయడంతో పాటు తుది శ్వాస వరకు పార్టీకి సేవలు అందించారని కొనియాడారు. రంగారెడ్డి కూడా తండ్రి బాటలోనే పయనించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్, రాచమళ్ల రామస్వామి, వెంకటరెడ్డి, శేఖర్, రాంరెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

## రైతులకు రుణ మాఫీ చేయాలి: సీపీఎం

**మఠంపల్లి, మార్చి 27:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఒకటైన పంట రుణ మాఫీ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పాలకులు పంటల రుణాలను మాఫీచేయనందున రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి రూ.2లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు సయ్యద్ రన్‌మియా, కె.వెంకటరెడ్డి, పి.రాము, వినోద్, బాలిబాయి, పి.రవి, చల్లా లింగయ్య, శంభయ్య, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేములూరి ప్రాజెక్టు సరిహద్దులు గుర్తించేందుకు సర్వే



సర్వే చేస్తున్న నీటి పారుదల శాఖ అధికారులు

**మఠంపల్లి, మార్చి 27:** మండలంలోని యాతవాకిళ్ల వేములూరి ప్రాజెక్టు శిఖం సరిహద్దులను గుర్తించేందుకు బుధవారం ఐబీ, నీటి పారుదలశాఖలకు చెందిన అధికారులు సర్వే నిర్వహించారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టులో పూడిక తీయనందున శిఖం భూములను కొందరు కబ్జా చేస్తున్నారని ఆ గ్రామస్థులు భారీ నీటి పారుదల శాఖ, పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి ఇటీవల తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు సర్వే చేసి పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం పెంచడంతో పాటు హద్దులను గుర్తించడానికి సర్వే చేయడానికి అధికారులు వచ్చారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

**కోదాడ, మార్చి 27:** పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉద్యోగం సాధించవచ్చని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. ఆస్కో ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు బుధవారం ఎంఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలను పూర్తిగా చదివితే పోటీ పరీక్షలో ప్రతి ప్రశ్నకు జవాబును సులభంగా రాయవచ్చని అన్నారు. ఆస్కో వారు ఇస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాతంగి ప్రభాకర్, స్వామి దాసు, వెంకటేశ్వర్లు, బుచ్చారావు, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**మఠంపల్లి, మార్చి 27:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి స్వగ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని అల్లీపురం గ్రామ మాజీ సర్పంచ్ బోగాల పిచ్చిరెడ్డి అన్నారు. పిల్లి వివేక్ మణికంఠ ఆధ్వర్యంలో బుధవారం అల్లీపురం గ్రామంలో జై శ్రీరాం కబడ్డీ జట్టు క్రీడాకారులకు, గ్రామ యువకులకు టీ షర్టులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.

## నీటి ఎద్దడి లేకుండా చూస్తాం



కుక్కడం గ్రామంలో బోరును పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

**మద్దిరాల, మార్చి 27:** వేసవి కాలం వచ్చినందున గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కుక్కడం, కుంటపల్లి, చందుపట్ల గ్రామాల్లో తాగు నీటి ట్యాంక్‌లను పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలన్నారు. పైపు లైన్లకు లీకేజీలు ఏర్పడితే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు తేజశ్రీ, లలిత, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**పెన్‌పహాడ్, మార్చి 27:** మండలంలోని మాచారం ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన చిత్రం శివ, నారాయణగూడెం గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన నారాయణ లింగారెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పోట్లపహాడ్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడు నారాయణ రామచంద్రారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ జీడి భిక్షం, దొంగరి యుగంధర్, పీఏసీఎస్ చైర్మన్, నాతాల జానికిరాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివా‌స్‌రెడ్డి, బిట్టు నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు అనిరెడ్డి రంగారెడ్డి, రాజేష్ రెడ్డి, అనిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, పొదిల నాగార్జున, గుర్రం సత్యనారాయణ రెడ్డి, జీవన్ రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

**హుజూర్‌నగర్ రూరల్, మార్చి 27:** మండలంలోని అంజలిపురంలో కబడ్డీ క్రీడాకారులకు వివేక్‌మణికంఠ ఆధ్వర్యంలో బుధవారం టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థినుల రక్షణకు షీటీం కృషి

**సూర్యాపేట అర్బన్ మార్చి 27:** విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణకు షీటీం ఎనలేని కృషి చేస్తుందని సూర్యాపేట టు టౌన్ ఎస్ఐ మహేంద్రనాథ్ అన్నారు. బుధవారం షీటీం ఆధ్వర్యంలో సూర్యాపేటలోని మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా వేధిస్తే మహిళలు, విద్యార్థినులు వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం పలు సామాజిక అంశాలపై పోలీస్ కళా బృందం సభ్యులు ఆట- పాటలతో అవగాహన కల్పించారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ రణబోతు రవీందర్‌రెడ్డి షీటీం సభ్యులు జాఫర్, ఎల్లారెడ్డి, గోపి, ఎల్లయ్య, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.